## క్లుప్తంగా

### సరస్వతీదేవి విగ్రహం ఆవిష్కరణ



చినలంకాం పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహం

బూర్జ: మండలంలోని చినలంకాం ప్రాథమిక పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి విగ్రహ ఆవిష్కరణ మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ సీర ప్రభావతి, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యా కమిటీ చైర్‌పర్సన్ బట్న ప్రశాంతి, ఏఎంసీ డైరెక్టర్ సీర డిల్లేశ్వరరావు, గ్రామపెద్దలు, విద్యార్థులు, తల్లిదండ్రుల ఆర్థిక సహకారంతో సుమారు రూ.లక్షతో విగ్రహాన్ని తయారు చేయించారు. సహస్ర కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### 3న వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభం



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణచైతన్య

సారవకోట: సెప్టెంబర్ 3వ తేదీన సారవకోటలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం ప్రారంభించనున్నట్లు పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య మంగళవారం తెలిపారు. పార్టీ కార్యాలయం కోసం తీసుకున్న పాత కల్యాణ మండపాన్ని పరిశీలించారు. దీనిపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ గెల్లంకి వెంకటరావు, పార్టీ నాయకులు తంగి రమణ, పారిశెల్లి తేజేశ్వరరావు, యాళ్ల శ్యామసుందరరావు, కోరాడ అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

### ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తాం



తాగునీటి పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ ప్రసాద్

జలుమూరు: జగనన్న కాలనీలలో ప్రతి ఇంటికీ తాగునీరు అందిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ టీఎస్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని చల్లవానిపేట, లింగాలవలస గ్రామాలలో జగనన్న కాలనీలలో జరుగుతున్న తాగునీటి సరఫరా పనులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న కాలనీలలో బుధవారం ఇక్కడున్న తాగునీటి పథకం ద్వారా ట్రైల్ రన్ నిర్వహిస్తామన్నారు.ఈఈ జాన్ బెనహర్, డీఈఈ జల్లు సుదర్శన్, పంచాయతీ విస్తర్ణ అధికారి పి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### నేడు నరసన్నపేటలో గడపగడపకు మన ప్రభుత్వం

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలోని నక్కవీధి, వజ్రంపేటతోపాటు పరిసర వీధుల్లో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ బూరల్లి శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

### ప్రకృతి వ్యవసాయంతో అధికలాభాలు



కిట్లు పంపిణీ చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తూరు: రైతులు పెట్టుబడి తగ్గించుకుని వ్యవసాయం చేయాలని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనీ సూర్యనారాయణ అన్నారు. కొత్తూరు మండల కేంద్రంలోని రామాలయం వద్ద మంగళవారం రైతులతో జరిగిన సమావేశంలో పలు సూచనలు చేశారు. ఖర్చు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించేందుకు, భూసారం కాపాడుకునేందుకు ప్రకృతి వ్యవసాయ సాగు విధానం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. లింగాకర్షక బుట్టలు పంపిణీ చేశారు. రమేష్, జనార్దనరావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.



### ● లోక కల్యాణార్థం

నరసన్నపేటలోని కల్యాణ మండపంలో పాతపట్నం మండలానికి చెందిన రామ్ రామ్ గురూజీ ఆధ్వర్యంలో లోక కల్యాణార్థం నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న అష్టలక్ష్మి కుంకుమార్చనలు మంగళవారంతో ముగిశాయి. స్థానిక కళింగ వైశ్య సంఘం, హరేరామ భక్త బృందం సహకారంతో పూజలు చేపట్టారు. భక్తుల నుంచి ఎటువంటి కానుకలు, రుసుం తీసుకోకుండా పూజలు చేపట్టినట్లు కళింగ వైశ్య సేవా సంఘం ప్రతినిధి సుధాకర్ తెలిపారు. 156 మంది మహిళలు ఈ పూజల్లో పాల్గొన్నారన్నారు.

– నరసన్నపేట

### ● వైభవంగా అసిరితల్లి ఉత్సవం



పొందూరు మండలంలోని పిల్లలవలస గ్రామంలో అసిరితల్లి ద్వితీయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. అసిరితల్లికి మహిళలు ముర్రాటలు చెల్లించారు. పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామంలో ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. బంధువులతో కళకళలాడింది.

- పొందూరు

# దశాబ్దాల కల నెరవేర్చిన సీఎం జగన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- బ్రిడ్జి నిర్మాణంలో రెడ్డి నాగభూషణరావు కృషి ఎంతో ఉంది
- 27 గ్రామాల ప్రజలకు చిరకాల కోరిక తీరింది
- పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట/పాతపట్నం: పాతపట్నం మండలంలోని 27 గ్రామాల ప్రజల దశాబ్దాల కోరిక తీర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. కొరసవాడ, రొమదల గ్రామాల మధ్య మహేంద్రతనయ నదిపై రూ.6.95 కోట్ల ఖర్చుతో నిర్మించిన వంతెనను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కాగువాడ, కొరసవాడ, బూరగాం, రొమదల, రొంపివలస, బైదలాపురం, పెద్దసున్నాపురం, ఆర్‌ఎల్‌పురం, రామకృష్ణాపురం, చాకిపల్లి, నల్లబొంతు, సోద తదితర గ్రామాలకు రాకపోకలకు మార్గం సులువైందన్నారు. నది దాటి వెళ్లేందుకు విద్యార్థులు, మహిళలు, వృద్ధులు, రైతులు అనేక ఇబ్బందులు పడేవారని, పడవపై నది దాటి వెళుతున్న సందర్భంగా అనేకసార్లు బోల్తాపడి ఎంతో మంది మృతి చెందారని గుర్తుచేశారు. రైతులు వ్యవసాయ అవసరాలకు ప్రతీరోజు నది దాటి వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు ఎంతో సులువైందన్నారు. బ్రిడ్జి నిర్మాణానికి రూ.6.95 కోట్లు, రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు ఈ ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. 8 నెలల్లో పనులు పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ మహేంద్రతనయ నదిలో నీటి ప్రవాహం కారణంగా ఏడాదిలో పనులు పూర్తిచేమన్నారు. నిధుల మంజూరు చేసింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అయితే పార్లమెంటు నుంచి నిధులు తెచ్చామని మాజీ సీఎం చంద్రబాబు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్నాయుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ప్రజలకు తప్పుడు సమాచారం ఇస్తున్నారని, ఇది గుర్తుంచుకుని వచ్చే ఎన్నికల్లో ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. ఈ సమావేశంలో పాల్గొన్న స్థానిక నాయకులు మాట్లాడుతూ.. 2019 ఎన్నికల ముందు ఎమ్మెల్యే భర్త రెడ్డి నాగభూషణరావు కొరసవాడలో సమావేశం ఏర్పాటు చేశారని గుర్తుచేసుకున్నారు. ఏం కావాలో చెప్పాలని కోరగా.. నదిపై వంతెన కావాలని కోరామన్నారు. వంతెన నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు ఇవ్వకపోతే స్వంత నిధులతో నిర్మించి వంతెన ఇస్తానని మాట ఇచ్చారని, ఇచ్చిన మాట ప్రకారం వంతెన మంజూరు చేయించారన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ వి.ఎస్.ఎన్.మూర్తి, కొత్తూరు, పాతపట్నం డీఈలు రాధారాణి, ఆర్.ఎస్.ప్రసాద్, పాతపట్నం, ఎల్.ఎన్.పేట ఎంపీపీలు దొర సావిత్రమ్మ, రెడ్డి జ్యోతిలక్ష్మి, కొండాల అర్జునుడు, ఎం.శ్యామసుందరరావు, అమర ఉష, మద్దు సుగుణకుమారి, నల్లి జగదీశ్వరరావు, ఎం.అప్పలనాయుడు, మంచు చంద్రయ్య, గణపతి తేజేశ్వరి, గణపతి మధుబాబు, మద్దు తాతయ్య, కర్రి లక్ష్మీనారాయణ, మాధవ పొళిక్కి రెడ్డి రామారావు, పెనుమజ్జి విష్ణుమూర్తి, సవిరిగాన ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# జవాబుదారీతనం ఉంటేనే అభివృద్ధి సాధ్యం

- కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ సదస్సులో స్పీకర్ తమ్మినేని సీతారాం



మాట్లాడుతున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

ఆమదాలవలస: జవాబుదారీతనంతో పనిచేయడం అభివృద్ధి చెందే దేశ నిర్మాణానికి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. రాజస్థాన్ రాష్ట్రం ఉదయపూర్‌లో జరుగుతున్న తొమ్మిదో కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ ప్రతినిధుల సదస్సులో పాల్గొన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంగళవారం దేశాభివృద్ధిలో ప్రజాస్వామ్య సంస్థల పాత్ర, వాటి తీరుతెన్నులు అనే అంశంపై స్పీకర్ తమ్మినేని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజలకు మేలు చేకూరేలా రాజ్యాంగ సంస్థలు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్య భావన, బాధ్యత, ఆలోచనల వైవిధ్యంతో ప్రజాస్వామ్యం లక్ష్యాలు ఎల్లలు దాటుతున్నాయన్నారు. ప్రజాస్వామ్య సంస్థలు సుస్థిరవృద్ధి, దేశాభివృద్ధికి మూలస్తంభాలుగా నిలవాలని ఆకాంక్షించారు. సంస్థలు చక్కని స్వభావంతో, వృద్ధి అవకాశాలను మరింతగా పెంచడానికి వ్యవస్థీకృత నిర్ణయం తీసుకోవడానికి వేదికగా నిలుస్తున్నాయన్నారు. వివిధ వర్గాల నుంచి విభిన్న అభిప్రాయాలు, నిర్ణయాలలో పరిగణనలోకి తీసుకునేలా చూడాల్సిన బాధ్యత ప్రజాస్వామ్య సంస్థలపై ఉందన్నారు. బ్యూరోక్రసీ, ప్రైవేట్ వర్క్‌ఫోర్స్ సహాయంతో విధానాలు, ప్రణాళికలను అమలు చేయడానికి సంస్థలు చిత్తశుద్ధితో వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. స్థిరమైన వృద్ధి సాధించడం కోసం సమర్థమైన, నిర్మాణాత్మకమైన సంస్థలు ఉండాలన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో దేశ ఆర్థిక, సామాజిక పరిస్థితిని మెరుగుపరచడంలో చేదోడువాదోడుగా నిలవాల్సి ఉందన్నారు. దీర్ఘకాలిక ప్రజావసరాలను దృష్టిలో ఉంచుకుని వనరులను సద్వినియోగం చేసుకోవడం ద్వారా సంపదను సృష్టించే మార్గాలను అన్వేషించాల్సిన బాధ్యత ప్రజాస్వామ్య సంస్థలపై ఉందన్నారు.

# 98 మందికి నేత్ర పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, ధర్మాన కృష్ణచైతన్య

సారవకోట: మండలంలోని అలుదు గ్రామంలో మంగళవారం వరుదు పరిమళ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 98 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అలుదు గ్రామానికి చెందిన వరుదు పరిమళ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని విశాఖపట్నం ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య ప్రారంభించారు. తన తల్లి జ్ఞాపకార్థం 12 ఏళ్లుగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని, దాంట్లో భాగంగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్సీ తెలిపారు. 98 మంది కంటి వైద్య పరీక్షలు నిర్వహించామని, 35 మందికి శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేసినట్లు శంకర ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, వరుదు దేవీప్రసాద్, సర్పంచ్ సాగిపల్లి దండాశి, వైస్ ఎంపీటీసీలు గుణుపురం రామారావు, పంచిరెడ్డి జ్ఞానేశ్వరి, సారవకోట పీఏసీఎస్ చైర్మన్ గెల్లంకి వెంకటరావు, పార్టీ నాయకులు యాళ్ల శ్యామసుందరరావు, కోరాడ అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

### గ్రామ వలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్

సారవకోట: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీఓ రేణుక మంగళవారం తెలిపారు. మహాశింగి పంచాయతీ క్లస్టర్ 6, కూర్మనాథపురం పంచాయతీ క్లస్టర్ 5 బీసీ జనరల్‌కు కేటాయించినట్లు పేర్కొన్నారు.ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

### విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆమదాలవలస: శ్రీకాకుళం నుంచి ఆమదాలవలస వెళ్లే రోడ్డులో గురువారం విద్యుత్ స్తంభాలు వేయనుండటంతో ఆమదాలవలస సబ్-స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎస్.భయ్యన్నాయుడు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు చింతాడ, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

### గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని గ్రామాల్లోనూ పారిశుద్ధ్య పనులు చేపట్టాలని ఎంపీడీఓ ఆర్.కాశీప్రసాద్ పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం కావటంతో డ్రైనేజీ వ్యవస్థ మెరుగ్గా ఉండాలన్నారు. మురుగునీరు వీధుల్లో నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బావుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. బోర్లు, కుళాయిలు, తాగునీటి బావులు చుట్టూ పిచ్చి మొక్కలు లేకుండా చేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. మండల కేంద్రంలో పారిశుద్ధ్య సమస్య లేకుండా చేయాలన్నారు.

### సేవలే గుర్తింపునిస్తాయి

బూర్జ: ప్రతీ ఉద్యోగికి విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని సర్పంచ్ జీడి వేణు అన్నారు. మండలంలోని కొల్లివలస ప్రాథమిక పాఠశాల హెచ్ఎం సుభాషిణీనాయక్ తోటవాడ పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఆమెను కొల్లివలసలో గాంధీ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో మంగళవారం సత్కరించారు. సంఘ అధ్యక్షుడు సురేష్, సంఘం సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన

నరసన్నపేట: అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. నరసన్నపేటలోని శివనగర్, కలాసీ కాలనీల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే, పార్టీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకు పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని శివనగర్, కలాసీ కాలనీలకు చెందిన పలువురు మహిళలు ఎమ్మెల్యేను కోరారు. దీనిపై ఎమ్మెల్యే వెంటనే స్పందించారు. జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. నెదర్లాండ్ ప్రభుత్వ సాయంతో 25 ఏళ్ల క్రితం 120 రేక్ షెడ్లు వేశారని, వీటిల్లో కొంతమంది పక్కా ఇళ్లు నిర్మించుకోగా.. మిగిలినవారు ఆ శిథిల ఇళ్లల్లోనే ఉంటున్నారన్నారు. వారందరికీ పక్కా ఇళ్లు ఇవ్వాల్సిన అవసరం ఉందని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. సాధ్యాసాధ్యాలు పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామని కలెక్టర్ సమాధానం ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేను స్థానికులు కోరారు. తగిన చర్యలు చేపట్టాలని సర్పంచ్ బూరల్లి శంకర్‌కు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలందరికీ మేలు చేయాలనే ఉద్దేశంతో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లోనూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, తనను ఆదరించాలని కోరారు. టీడీపీ నాయకులు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవాలు లేవని, వారి ప్రాభల్యం కోసమే విమర్శలు చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకుల మాటలు, వారి హామీలు ప్రజలు నమ్మవద్దని సూచించారు. సర్వేలు అన్నీ వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉండటంతో టీడీపీ నాయకులు సహించలేక పోతున్నారన్నారు. ఈ సర్వేలు నిజం అవుతాయని, మళ్లీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ సభ్యురాలు చింతు అన్నపూర్ణ, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, సొసైటీ అధ్యక్షుడు పొన్నాన దాలినాయుడు, పార్టీ నాయకులు గుప్త, రావాడ మోహన్‌రావు, పట్ట లక్ష్మణరావు, ఇట్రాజు సూరిబాబు, డేవిడ్, నేతింటి సింహాచలం, పతివాడ గిరీశ్వరరావు, రమణ సాహు, కనపల శేఖర్, సవర శైలజ తదితరులు పాల్గొన్నారు.

### నిర్దేశిత లక్ష్యాలు చేరుకోవాలి

- డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్



సమీక్ష నిర్వహిస్తున్న పీడీ విద్యాసాగర్

నరసన్నపేట: వెలుగు సీసీలు, ఇతర సిబ్బందికి నెల, రోజువారి నిర్దేశించిన లక్ష్యాలను విధిగా చేరుకోవాలని, అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్ హెచ్చరించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో నరసన్నపేట, జలుమూరు, పోలాకి, శ్రీకాకుళం రూరల్, గార మండలాలకు చెందిన సీసీలతోపాటు ఇతర సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. పోలాకి సిబ్బందికి ఇచ్చిన లక్ష్యాలను చేరుకోవడంలో అలసత్వం వహించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతలు విస్మరిస్తే తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. లక్ష్యాలను అధిగమించిన సిబ్బందికి అభినందించడం జరుగుతుందన్నారు. నరసన్నపేట మహిళా మార్ట్‌లో లావాదేవీలు నిర్వహించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. మండలాలకు ఇచ్చిన లక్ష్యాలను పూర్తిచేయాలని ఆదేశించారు. పలు అంశాలపై పీడీ సమీక్ష చేశారు. ప్రభుత్వ కార్యక్రమాలన్నింటిలో మరింత బాధ్యత చూపాలని, అర్హులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. నరసన్నపేట ఏపీ కొండలరావు, నరసన్నపేట మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చింతు శ్రీదేవి పాల్గొన్నారు.

# కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్
- ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కారం



ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులతో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: కార్పొరేట్ దీటుగా నేడు ప్రభుత్వ బడులు నిలుస్తున్నాయని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదిలో 500లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు స్కూల్ పూర్వ విద్యార్థుల సహకారంతో ఉపాధ్యాయులు మంగళవారం సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు.

ప్రభుత్వ బడుల్లో కూడా 500 పైగా మార్కులు రావడం గతంలో ఎప్పుడైనా చూశారా అని విద్యార్థులకు ప్రశ్నించారు. వందల మంది విద్యార్థుల్లో ఒకరో, ఇద్దరో మంచి మార్కులు పొందే వారని, ఇప్పుడు ఆ పరిస్థితులు మారాయని, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడుల్లోనూ ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులు పదుల సంఖ్యలో ఉన్నారన్నారు. దీనికి ఉదాహరణ నరసన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలే అని అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నత ఆశయంతో ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు ద్వారా అభివృద్ధి చేస్తున్నారని, విద్యార్థులకు అన్ని సౌకర్యాలూ కల్పిస్తున్నారని వివరించారు. స్కూళ్లలో పరిస్థితులు పూర్తిగా మారాయన్నారు. ఉపాధ్యాయుల కృషి కూడా అభినందనీయమన్నారు. ఈ విధంగా ప్రభుత్వ స్కూళ్లలో ఉత్తమ ఫలితాలు పొందిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించడం మంచి విధానమని, మిగిలిన స్కూళ్లలో కూడా పూర్వ విద్యార్థులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఉపాధ్యాయుడు సాయి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.35 వేల నుంచి రూ.5 వేల వరకు ప్రోత్సాహకాలు అందించినట్లు తెలిపారు. పూర్వ విద్యార్థి ఖండపల్లి శ్రీధర్ తోపాటు పలువురు ప్రోత్సాహకాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకటరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణస్వామి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సదాశివుని కృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, సురంగి నర్సింగరావు, పాగోటి రాజారావు, నేతింటి రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న డిప్యూటీ ఈఓ పగడాలమ్మ

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని డిప్యూటీ ఈఓ గార పగడాలమ్మ అన్నారు. మండలంలోని కరకవలస జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో మాట్లాడారు. చదువుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించేలా ఇప్పటినుంచే ప్రణాళికాబద్ధంగా విద్యాబోధన జరుగుతుందన్నారు. ప్రతీ పాఠశాలలో శతశాతం ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అందరి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశామన్నారు. నాడు-నేడు పనులు వేగవంతం చేసేలా చర్యలు చేపట్టామన్నారు. కరకవలస జెడ్పీ ఉన్నత పాఠశాలలో 3 నుంచి పదో తరగతి వరకు 311 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం రుచికరంగా పెడుతున్నారన్నారు. ఈ పాఠశాల కార్పొరేట్ కంటే మెరుగ్గా ఉందన్నారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను తెలుసుకున్నారు. ఎంఈఓ మణికుమార్, హెచ్ఎం పి.రామారావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### అన్నదాన కార్యక్రమం ప్రారంభం



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: పాతపట్నంలోని నీలమణి దుర్గ అమ్మవారి సన్నిధిలో ప్రతీ మంగళవారం జరిగే అన్నదాన కార్యక్రమాన్ని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ప్రారంభించారు. అమ్మవారి దర్శనం కోసం ఆంధ్రా, ఒడిశా ప్రాంతాల నుంచి మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. ప్రతీ మంగళవారం అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. పాతపట్నంతోపాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు ప్రతీ మంగళవారం అన్నదానం చేసేందుకు ముందుకు వస్తున్నారని, దాతల సహాయంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ప్రతీరోజు రూ.10లకు పులిహోరా ప్యాకెట్లు ప్రసాదంగా విక్రయిస్తున్నట్లు తెలిపారు. ప్రసాద విక్రయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన శుద్ధతాగునీటి యంత్రాన్ని కూడా ప్రారంభించారు. సవిరిగాన ప్రదీప్, నీలమణి దుర్గ అమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ ఎన్.ఈశ్వరరావు, కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.